# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రపంచం ఎదుర్కొంటున్న నూతన సవాళ్లకు పరిష్కారం అందించే ప్రతిభ, సామర్థ్యం భారత యువతకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ❖ న్యూ ఢిల్లీలో నిరసనలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం (OHCHR) వ్యాఖ్యలు అనవసరమైనవని, ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

- ❖ ఇండోర్ లోని హోల్కర్ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

- ❖ కేరళం, మాహే, లక్షద్వీప్, తమిళనాడులో మంగళవారం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

==============================

ప్రపంచం నూతన సవాళ్లకు పరిష్కారాల కోసం ఎదురుచూస్తోందని, వాటిని అందించే ప్రతిభ, సామర్థ్యం భారత యువతకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. `వికసిత్ భారత్` లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషిస్తుందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశంలో యువతకు అద్భుతమైన అవకాశాలు లభిస్తున్నాయని, పూర్తి సామర్థ్యాన్ని గుర్తించి వారు దేశ పురోగతికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత రూపొందించే వినూత్న ఆలోచనలు, పరిష్కారాలు కేవలం భారత్ భవిష్యత్‌నే కాకుండా.. ప్రపంచ భవిష్యత్‌ను కూడా నిర్దేశిస్తాయని స్పష్టం చేశారు. సమిష్టి కృషితోనే దేశ ఆకాంక్షలను నెరవేర్చుకోగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో ఉత్పాదక రంగం వేగంగా విస్తరిస్తోందని, దీనివల్ల యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. భారత రక్షణ రంగ ఎగుమతులు 50

రెట్లు పెరిగాయని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ దేశంగా భారతదేశం అవతరించిందని ప్రధానమంత్రి వివరించారు.

==============================

తమిళనాడులో 13 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెన్నై ఐఐటీ మద్రాస్‌లో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రోడ్డు, రైల్వే రవాణా, రేవుల (పోర్టు) మౌలిక వసతులు, పెట్రోలియం, శాస్త్రీయ పరిశోధన రంగాలకు సంబంధించి ఈ నిధులను వెచ్చించనున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ పాల్గొన్నారు. సభను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... తమిళనాడులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఇవి రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడమే కాకుండా.. పరిశ్రమలు, వ్యాపార రంగాన్ని బలోపేతం చేసి రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. సమృద్ధిగా ఉన్న సాంస్కృతిక వారసత్వం, శాస్త్రీయ విజయాలు, ఆధునిక మౌలిక వసతులే భారత్ పురోగతికి మూలమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఐఐటీ మద్రాస్‌లోని సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. 100 కంటే ఎక్కువ మానవ మెదళ్లను మ్యాపింగ్ చేసి, కణాల స్థాయిలో 3D అట్లాస్‌లను రూపొందించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పరిశోధనా కేంద్రంలో.. గర్భస్థ దశ నుంచి వృద్ధాప్యం వరకు ఇందులో అధ్యయనం చేయనున్నారు. అంతకుముందు.. చెన్నై మెట్రో రెండో విడతలోని పూనమల్లి - వడపళని మార్గాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సుమారు 4 వేల 900 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ కారిడార్-4 మార్గంలో 15 కిలోమీటర్ల పరిధిలో 11 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కలసి కొత్త మెట్రో సేవలను రైలులో ప్రయాణించి పరిశీలించారు.

==============================

న్యూ ఢిల్లీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం (OHCHR) చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవి అనవసరమైనవని, దేశ అంతర్గత వ్యవహారాల్లో అంగీకారయోగ్యంకాని జోక్యమని స్పష్టం చేసింది. OHCHR చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదని, ప్రజా అంశాలపై ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. భారత పొరుగు దేశాల్లో నిరసనలపై హింసాత్మక చర్యలు జరిగినప్పుడు, అలాగే ఐక్యరాజ్యసమితి సంస్థలున్న ప్రాంతాల సమీపంలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు చేపట్టినప్పుడు ఈ సంస్థ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదని గుర్తు చేశారు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు అంతర్జాతీయ సంస్థల విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీస్తాయని జైస్వాల్ విమర్శించారు.

==============================

ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల (OMCs) రోజువారీ డాలర్ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ప్రత్యేక సదుపాయాన్ని ప్రకటించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (IOCL), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL).. ఈ మూడు చమురు కంపెనీల విదేశీ మారకద్రవ్యం అవసరాలను తీర్చేందుకు ఆర్‌బీఐ తన వద్ద ఉన్న యూఎస్ డాలర్లను నిర్దేశిత బ్యాంకుల ద్వారా విక్రయించనుంది. ఈ ప్రత్యేక సదుపాయం రేపటి నుంచి అమల్లోకి రానుందని, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఇది కొనసాగుతుందని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

విరామం

==============================

అసోం రాజధాని గౌహతిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB) భారీ ఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. సుమారు 43 కోట్ల రూపాయలు విలువ చేసే 53 కిలోలకు పైగా మెథాంఫెటమైన్ (Methamphetamine), డబ్ల్యూవై (WY) ట్యాబ్లెట్లను సీజ్ చేసింది. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు అంతర్ రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎన్‌సీబీ అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, అమ్మవారి ఆలయాల్లో తొమ్మిది రోజుల శరన్నవరాత్రి వేడుకలు ఈరోజు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాలలోని ప్రముఖ దేవాలయాలు ప్రత్యేక పూజలు, సాంప్రదాయ ఊరేగింపులు, వేద మంత్రోచ్చారణలతో మార్మోగాయి. మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని శ్రీ మహాలక్ష్మి ఆలయం, మహూర్‌లోని రేణుకా మాత ఆలయం, తుల్జాపూర్‌లోని తుల్జాభవాని ఆలయం, వానిలోని శ్రీ క్షేత్ర సప్తశృంగి గడ్ ఆలయాలు విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో సుందరంగా ముస్తాబయ్యాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్దఎత్తున బారులు తీరారు. ఈ నెల 20 వరకు జరిగే ఈ ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాంతియుతంగా సమావేశమయ్యే ప్రజలను అక్రమంగా నిర్బంధించవద్దని, ట్రాఫిక్ నిబంధనలకు లోబడి ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతి కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శాంతిభద్రతల పరిస్థితులకు లోబడి మెట్రో రైలు సేవలు యథావిధిగా నడిచేలా చూడాలని, ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాజధానిలో నిరసనల నేపథ్యంలో ఆంక్షలు, ప్రజా సేవల అంతరాయంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 10న ఢిల్లీ మెట్రో నెట్‌వర్క్‌లోని మొత్తం 303 మెట్రో స్టేషన్లలో కేవలం 45 స్టేషన్లలో మాత్రమే ప్రవేశ, నిష్క్రమణలపై పరిమితులు విధించామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ లో మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, పంచాయతీలకు నిర్వహించిన ఎన్నికలు, ఉపఎన్నికలు ఈరోజు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 11 వార్డులకు గాను సాయంత్రం 6 గంటల సమయానికి సగటున 55 శాతం పోలింగ్ నమోదైందని ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. బనస్కాంతా జిల్లాలోని థారా మున్సిపాలిటీ (6 వార్డులు)లో అత్యధికంగా 79 శాతం పోలింగ్ జరగ్గా.. దేవభూమి ద్వారకా జిల్లాలోని ఓఖా మున్సిపాలిటీ (9 వార్డులు)లో 56.44 శాతం మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ISSF) `ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్` టోర్నమెంట్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత యువ షూటర్ ఉదయ్‌వీర్ సిద్ధూ పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తుది రౌండ్‌లో జర్మనీ దిగ్గజ షూటర్ క్రిస్టియన్ రీట్జ్‌పై విజయం సాధించాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండోర్ లోని హోల్కర్ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ జట్టు ముందుగా బౌలింగ్ (ఫీల్డింగ్) ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ జట్టు 16 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా నిలిచాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళం, మాహే, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో మంగళవారం వరకు ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండి హెచ్చరించింది. ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పంజాబ్, హర్యానా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, గుజరాత్, కొంకణ్, మధ్య మహారాష్ట్ర ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని కేరళం, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ ను IMD జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =